
సాక్షి ఒడిశా
మంగళవారం । 17 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,13,394లు, బంగారం 5.9 గ్రాములు, వెండి 51.95 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ఆరంభం.. అదిరింది

- 8లో



పొగమంచుతో దారి తప్పిన పడవ

- 8లో

న్యూస్‌రీల్

కొడుకుని చంపి.. తల్లి ఆత్మహత్య!

కటక్: కటక్ మహానగరం మధుపట్న ప్రాంతంలో సోమవారం సంచలనాత్మక ఘటన చోటు చేసుకుంది. తల్లి ఉరి వేసుకుని వేలాడుతున్న పరిసరాల్లో పసిబిడ్డ మరణించి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ పరిసరాల దృష్ట్యా బాలుడిని చంపి, తల్లి బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. రెండేళ్ల బాలుడి గొంతు నులిమి హతమార్చిన అనంతరం తల్లి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది. మధుపట్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లీబిడ్డల మృత దేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

ప్రైవేట్ బస్సుల సమ్మె వాయిదా



భువనేశ్వర్: ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. ఈనెల 17నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ బస్సుల నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఈ వర్గం ప్రకటించిన విషయం తెలిసిందే. 10 ప్రధాన డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా బస్సుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన యజమానులు.. వెనుకడుగు వేసింది. బంద్ పిలుపు నేపథ్యంలో ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం డిమాండ్ల సాధనకు ప్రభుత్వంతో జరిపిన చర్చలు పాక్షికంగా ఫలప్రదం అయ్యాయి. ప్రాథమిక దశలో ప్రభుత్వం మూడు డిమాండ్ల పట్ల సుముఖత వ్యక్తం చేసింది. మిగిలిన డిమాండ్లకు ప్రభుత్వం సమయం కోరిందని ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం తెలిపింది. మార్చి 31లోగా ఈ విషయమై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాల్సి ఉంటుందని ఆందోళనకారుల వర్గం స్పష్టం చేసింది. ఈ వ్యవధిలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే నిరవధిక సమ్మె అనివార్యం అవుతుందని హెచ్చరించారు. డొక్కు బస్సుల తొలగింపు కార్యాచరణకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్క్రాప్ విధానం పట్ల ఇరువర్గాల మధ్య రాజీ కుదిరింది. రద్దు విధానం అమలు ప్రకారం 15ఏళ్ల పైబడిన బస్సు వినియోగాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరిమితిని 20 ఏళ్లకు విస్తరించేందుకు రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చింది. అదేవిధంగా పగటిపూట స్లీపర్ కోచ్ బస్సు రవాణా, పర్మిట్ బదిలీ వంటి డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

105 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

బరంపురం: కొందమాల్ నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బరంపురం ఎక్సైజ్ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 105కిలోల గంజాయిని పట్టుకోవడంతో పాటు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బరంపురం ఎక్సైజ్ అధికారి ఉదయచంద్ర మహంతి తెలిపిన వివరాల ప్రకారం కొందమాల్ జిల్లా నుంచి దిగపండి మీదుగా బరంపురం వైపు సోమవారం ఉదయం వస్తున్న ఓ కారులో గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అస్కా పోలీసు స్టేషన్ పరిధి కలుసండపూర్ జంక్షన్‌లో మాటు వేసి, వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అటుగా వస్తున్న వాహనంలో 105కిలోల గంజాయితోపాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితులు నయాగడా జిల్లాకు చెందిన కృష్ణపాత్రొ, పూరీ జిల్లాకు చెందిన రామచండిగా గుర్తించారు.

జేకే మిల్‌కు పేపర్ మిల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

రాయగడ: పట్టణానికి సమీపంలోని జేకే పేపర్ మిల్‌కు ప్రతిష్టాత్మకమైన మిల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. ఇండియన్ పేపర్ మేనుఫ్యాక్చర్స్ అసోసియేషన్(ఐపీఎంఏ) ఈ అవార్డును 2021–22కు గాను ప్రకటించింది. పేపర్ ఉత్పత్తిలో నాణ్యత, ఉత్పత్తి సామర్థ్యం, హెచ్‌ఆర్‌డీ, ఎగుమతి, మార్కెటింగ్ వంటి వాటిలో అగ్రస్థానంలో ఉండటంతో ఈ అవార్డు జేకే మిల్‌కు దక్కినట్టు ఐపీఎంఏ అధ్యక్షుడు ఏఎస్ మెహతా ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న ఢిల్లీలో జరిగిన 23వ ఐపీఎంఏ సమావేశంలో అతిథిగా పాల్గొన్న పేపర్ లిమిటెడ్ హరిష్‌పతి సింఘానియా అవార్డును జేకే పేపర్‌మిల్ ఉపాధ్యక్షుడు(వర్క్స్) వినయ్ ద్వివేదికి అందించారు. ఎఫ్‌ఆర్‌వై మేనేజిమెంట్ కన్సల్టింగ్ డైరెక్టర్(ఫిన్‌ల్యాండ్) టొమీ అంబేరియా ప్రాల్గొన్నారు.

సంబరాల సంక్రాంతి



జయపురం: సింగర్ ధనుంజయ్‌తో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



జయపురం: వేడుకల్లో జనసంద్రం

రాష్ట్రంలోని తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను ఆదివారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పిల్లలు, పెద్దలు సంప్రదాయ వస్త్ర ధారణలో మెరిశారు. బంధువులు, స్నేహితులతో గ్రామాలు కళకళలాడాయి. వాకిళ్లలో వేసిన రంగవల్లులు, ఆకాశంలో ఎగురవేసిన పతంగులు, హరిదాసు కీర్తనలు, డూడూ బసవన్న విన్యాసాలతో పల్లెలు, పట్టణాలు, నగరాల్లో పండగ శోభనెలకొంది. సంబరాల్లో భాగంగా పలుచోట్ల చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమవారం కనుమ పండగ నిర్వహించారు. గజపతి జిల్లా గుసాని సమితి సరియాపల్లి గ్రామం వద్ద సీతకొండ చేరుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. జయపురంలో జరిగని సంక్రాతి సంబరాలను ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు. ప్రముఖ టాలివుడ్ సింగర్లు కల్పన, ధనుంజయ్ మధురమైన తెలుగు, హిందీ సినీమా పాటలతో ఆకట్టుకున్నారు. పర్లాకిమిడి రాంనగర్‌లో హైటెక్ ప్లాజా వద్ద జరిగిన సంబరాల్లో భాగంగా జబర్దస్త్ కళాకారులు గౌతం రాజు, చిత్రం శ్రీను, జబర్దస్త్ ఫేం ఆనంద్ తోకలిసి పలు స్కిట్‌లు, డ్యాన్సులు చేసి, ప్రేక్షకులను అలరించారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: తిరుపతి పాణిగ్రాహిని గజమాలతో సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, అధికారులు



జయపురం: ఇళ్ల ముంగిట తీర్చిదిద్దిన సంక్రాంతి ముగ్గు



జయపురం: పాటలతో అలరిస్తున్న గాయకురాలు కల్పన



పర్లాకిమిడి: సీతకొండ పైకి చేరుకుంటున్న యువతీ, యువకులు



జయపురం: జగన్నాథ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



జయపురం: వెంకట్రావు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు



పర్లాకిమిడి: సీతకొండపై చిన్నారుల సందడి



పర్లాకిమిడి: జబర్దస్త్ ఫేం పవిత్రా ప్రక్కన యాంకర్

అందరి సహకారంతోనే క్రీడోత్సవాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న మాఝి, కలెక్టర్, ఎస్పీ



దివ్యాంగునికి బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాయగడ: చొయితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8 నుంచి జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోన్న చొయితి క్రీడొత్సవాలు అందరి సహకారంతో ముగిసాయని స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్మన్ అనసూయ మాఝి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, బహుమతులు అందజేశారు. చొయితి క్రీడల్లో పాల్గొని, గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, జిల్లా పరిషత్ అధ్యక్షురాల సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు. మూడేళ్ల విరామం అనంతరం జరిగిన ఈ క్రీడోత్సవాల్లో ఎంతోమంది ఆసక్తికరంగా పాల్గొవడంపై అభినందించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండార్లు, సీనియర్ సిటిజన్లు హాజరు కావడంపై అభినందించారు.

శ్రీమందిరంలో సొమ్మసిల్లిన భక్తులు



జగన్నాథుని దర్శనం కోసం బొడొ దండొలో బారులు తీరిన భక్తులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలు

భువనేశ్వర్: మకర సంక్రాంతి సందర్భంగా శ్రీమందిరం జనంతో కిటకిటలాడింది. దర్శనం కోసం రద్దీ పెరగడంతో నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బారికేడ్లలో తోపులాట చోటు చేసుకుంది. మందిరం సముదాయంలో బహరొ కత(మహా లఘు దర్శన ప్రాంగణం) పరిసరాల్లో ఊపిరాడక ఇద్దరు మహిళలు సొమ్మసిల్లి పోయారు. ఇద్దరినీ పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు హతొగడియా సాహికి చెందిన సులోచన సాహు, కటక్ పితాపూర్‌కు చెందిన దివ్యసాహు(16)గా గుర్తించారు.

రాష్ట్రంలో వ్యాక్సినేషన్ పునఃప్రారంభం

భువనేశ్వర్: జాతీయ కోవిడ్–19 టీకాల ప్రదాన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఈ కార్యక్రమం మరోసారి ప్రారంభం కానుంది. ఈనెల 19 నుంచి కోవిడ్ టీకాల ప్రదాన ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం కింద కోవిషీల్డ్ టీకాలు వేస్తారు. 2వ మోతాదు, ప్రికాషన్ డోస్ టీకాలు తీసుకోని వారంతా ఈ అవకాశం సదినియోగం పరచుకోవాలని ఆరోగ్యశాఖ పిలుపునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రధాన ఆస్పత్రులు, సబ్ డివిజినల్ ఆస్పత్రులు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీకాల ప్రదాన కార్యక్రమం కొనసాగుతుంది. ఆరోగ్యశాఖ సమాచారం ప్రకారం రాష్ట్రంలో మొదటి డోస్ 3,14,53,853 మంది తీసుకోగా.. రెండో డోస్ 2,99,50,017 మంది తీసుకున్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు వారు 21,95,545మంది మొదటి డోస్ తీసుకోగా, 18,44,401 మంది రెండో డోస్ తీసుకున్నారు. 12 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న వారు 16,940 మంది మొదటి డోస్ తీసుకోగా, రెండో డోస్ కూడా 12,06,557 మంది తీసుకున్నారు. బూస్టర్ డోస్ విషయానికి వస్తే 18 నుంచి 59 ఏళ్లలోపు 99,98,889 మంది బూస్టర్ డోస్ తీసుకోగా, 60 ఏళ్లు పైబడిన వారు 31,99,855 మంది బూస్టర్ డోస్ తీసుకున్నారు.

భగవాన్ దాస్‌కు నివాళులు





అంతిమ సంస్కారాలకు హాజరైన ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ శ్రద్ధాంజలి

భువనేశ్వర్: బహుముఖ ప్రజ్ఞాశాలి దేవర భగవాన్ దాస్(79) కన్నుమూశారు. పూరీ స్వర్గద్వార్‌లో సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఖుర్దారోడ్ బల్లిభక్ సాహి ప్రాంతంలోని స్వగృహంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. ప్రవాసాంధ్రునిగా తరలి వచ్చిన భగవాన్.. రాష్ట్రస్థాయిలో విశేష గుర్తింపు సాధించడం విశేషం. నటన, కళలు, క్రీడారంగంలో లెక్కకు మిక్కిలిగా బహుమానాలు, పురస్కారాలు, సత్కారాలు, సన్మానాలు అందుకున్న ప్రవాసాంధ్ర వర్గానికి గర్వ కారణంగా నిలిచారు. ఖుర్దారోడ్ కేంద్రంగా తెలుగు నాటకరంగం ప్రాచుర్యానికి విశేష కృషి చేశారు. సాంఘిక, పౌరాణిక, సంస్కార శీర్షికలతో ఆయన పలు నాటకాలు, నాటికల్లో అభినయం ప్రదర్శించి కళాకారులను రంజింపజేశారు. రంగ స్థలంపై విభిన్నత చాటుకున్న ఆయన.. ఒడియా నాటకం, చలనచిత్ర రంగం, బుల్లితెరపై నటుడుగా పలు పాత్రలను పోషించి, తనదైన ఉనికిని బలపరచుకున్నారు. రైల్వేశాఖ ఖుర్దారోడ్ మండలం సీనియర్ టికెటు తనిఖీ(సీనియర్ సీటీఐ)గా ఉద్యోగం చేసి 2002లో విరామం పొందారు. ఉద్యోగ రంగంలో క్రమ శిక్షణకు మారు పేరుగా పలు అవార్డులు సాధించుకుంటూనే ఫుట్‌బాల్ క్రీడారంగంలో విశేష గుర్తింపు పొందారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ రిఫరీగా వెలుగొందారు. ఆయన ఇరువురు కుమారులకు ఫుట్‌బాల్ క్రీడారంగంలో ఆరితేరారు. పెద్ద కుమారుడు జాతీయస్థాయి ఫుట్‌బాల్ రిఫరీగా ఎదిగాడు. మయసభలో దుర్యోధనుని ఏక పాత్రాభినయం భగవాన్ దాస్ నటనా రంగానికి వన్నెదిద్దింది. మాతృ సంస్కృతి సంస్కారం, బహుభాషలు, ప్రాంతీయుల ఆచార వ్యవహారాలతో కలిసి మెలిసి బహుముఖంగా ఎదిగేందుకు దోహదపడుతుందని పలు సందర్భాల్లో ప్రవాసాంధ్రులున చైతన్య పరిచారు. ఆయన మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ శ్రద్ధాంజలి ఘటించారు. భగవాన్ దాస్ కర్మక్షేత్రంగా ఎదిగిన ప్రాంతంలో ఆయన పేరుతో వీధికి నామకరణం చేసే యోచన ఉందని స్థానిక వార్డు కౌన్సిలర్ బిష్ణుసాహు తెలిపారు. దాస్ మృతితో ఉన్నత శ్రేణి ఫుట్‌బాల్ క్రీడాకారుని రాష్ట్రం కోల్పోయిందని ఎమ్మెల్యే విచారం వ్యక్తంచేశారు. ఆయన అంతిమ యాత్రలో అభిమానులు, క్రీడాకారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి, ఎస్పీ శర్మ



ప్లకార్డులు పట్టుకుని సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదం తప్పదని, దీనిపై అంతా అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. రోడ్డు, రవాణాశాఖ(ఆర్‌టీఓ) ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మంత్రి.. తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి, నిండు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని విచారం వ్యక్తంచేశారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించగలిగితే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని, స్థానిక సర్క్యూట్ హౌస్ నుంచి ఎఫ్‌సీఐ గొడౌన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

ఉచిత ల్యాబ్ టెక్నీషియన్ శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ రక్తనిధి కేంద్రంలో మూడునెలల ఉచిత ల్యాబ్ టెక్నీషియన్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం కనీసం డీఎంఎల్‌టీ పాసై ఉండాలని, శిక్షణ కాలంలో స్టైఫండ్, సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. దరఖాస్తులు పాలకొండ రోడ్డులో ఉన్న బాపూజీ కళామందిర్‌కు ఎదురుగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పక్కన ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయానికి ఈ నెల 25వ తేదీలోగా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 08942- 226555, 9247137111 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రాణం తీసిన క్షణికావేశం


సంతోషి లక్ష్మి (ఫైల్)

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ బ్యారేజీ సెంటర్‌లో సంక్రాంతి సందర్భంగా ఆదివారం భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవ భార్య మృతికి కారణమైంది. ఈ గొడవ వల్ల సంతోషి లక్ష్మి (42) ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికు లు తెలిపిన వివరాల ప్రకారం హిరమండలం బ్యారేజ్ సెంటర్‌కు చెందిన శ్రీనివాస పట్నాయక్, అతని భార్య సంతోషి లక్ష్మిలు సంక్రాంతి రోజు ఆదివారం భోజనం విషయంలో మా టామాటా పెరిగి వాదులాడుకున్నారు. అతి కాస్తా గొడవగా మారడంతో సంతోషి లక్ష్మి ఇంటిలో బెడ్‌రూమ్‌కు వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నారు. ఇది గమనించిన కుటుంబ స భ్యులు వెంటనే ఆమెను కిందకు దించి హిర మండలం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమెకు చరణ్ అనే కుమారుడు ఉన్నాడు. మృతురాలి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ జగన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు


కాంతమ్మను వైజాగ్ కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలో గల పాలవలస గ్రామ కూడలి వద్ద రహదారిపై ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాల ప్రకారం పాలవలస గ్రామానికి చెందిన దాసి రెడ్డి కాంతమ్మ ఆదివారం రాత్రి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా జెడ్పీ హైస్కూల్ వద్ద పాలకొండ వైపు వెళ్తున్న బైక్ ఆమెను బలంగా ఢీకొట్టింది. కాంతమ్మకు బలమైన దెబ్బలు తగలడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. స్థానికులు ఆమెను గుర్తించి ప్రైవేటు వాహనంలో పాలకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈమె గ్రామంలో ఒంటరిగా ఉంటున్నారు. మనవడు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నంది వాహనంపై నాగాభరణుడు


నంది వాహనంపై స్వామికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని సోమవారం కనుమ సందర్భంగా నంది వాహనంపై ఊరేగించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను అలంకరించి నంది వాహనంపై తిరువీధి నిర్వహించారు. నగిరికటకం వరకు తిరువీధి జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హారతులిచ్చారు.

వంశధారలో మునిగి యువకుడి మృతి

భామిని: పెద్ద పండగను చూడడానికి వచ్చిన ఉద్దానం యువకుడు ఆదివారం వంశధార నదిలో మునిగిపోయి అసువులు బాశాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం కొత్తపుట్టుగకు చెందిన యర్రా పురుషోత్తం(26) హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ప్రైవేట్ ప్యాక్టరీలో పనిచేస్తున్నా డు. పురుషోత్తంతో పాటు అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న భామిని మండలంలోని బాలేరు–సొలికిరికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి పండగ కోసం బాలేరు వచ్చిన పురుషోత్తం మిత్రులతో కలిసి వంశధార నదిలో స్నానానికి దిగి మునిగిపోయి మృతిచెందాడు. మృతుడి మిత్రుల ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్సై అ మ్మాన్‌రావు, వీఆర్‌ఓ గెల్లంకి వెంకటరమణలు ప్రమాద స్థలానికి చేరుకు ని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు.


వేదికపై మంత్రి ప్రఫుల్లకుమార్, ఎస్‌డీసీ చైర్మన్ ప్రదీప్, ఎంపీ రమేష్‌చంద్ర


కలశ యాత్రలో పాల్గొన్న ప్రజలు


మెయిన్ రోడ్డుపై శంఖధ్వని నృత్యాలు

ఆరంభం.. అదిరింది

- ఘనంగా ప్రారంభమైన మాల్యవంత్ మహోత్సవాలు


కళాకారుల ప్రారంభ ఒడిస్సీ నృత్యం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో మాల్యవంత్ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక జగన్నాథ మందిరం వద్ద ఖొయిర్‌పుట్ సమితి బోండాఘాటీ అమ్మా కుండ్ నుంచి తీసుకు వచ్చిన కలశాలకు ఎస్‌డీసీ చైర్మన్ ప్రదీప్ మాఝి, మల్కన్‌గిరి సాంస్కృతిక అధ్యక్షుడు రత్నాకర్ సాహు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా చేపట్టిన యాత్రను కలెక్టర్ విశాల్‌సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. మాల్యవంత్ ఉత్సవ్ మండపం వరకు ఈ కలశయాత్ర కొనసాగింది. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు రాష్ట్ర ఖనిజశాఖ మంత్రి ప్రఫుల్లకుమార్ మల్లిక్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ వద్ద సంబల్‌పూర్ దుస్తులు, కటక్, పిప్పిలి, గిరిజన సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. కళాకారుల ఒడిస్సీ నృత్యం, అస్సాం బీహు, హర్యాణీ, ఖొయిర్‌పుట్ బోండా, కోల్‌కత్తా నుపూర్ నృత్యాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, కలెక్టర్ విశాల్‌సింగ్, జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ, గిరిజనాభివృద్ధి శాఖ అధ్యక్షుడు అద్మా రవ్వ, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సోమారీ టంగులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


కలశపూజ చేస్తున్న ఎస్‌డీసీ చైర్మన్ ప్రదీప్ మాఝి


ఆహుతులను హుషారెత్తించిన యాంకర్లు

పొగమంచుతో దారి తప్పిన పడవ


చిలికా సరస్సులో చిక్కుకున్న పడవ

బ్రహ్మగిరి: చిలికా సరస్సులో సరుకుతో పాటు ప్రయాణికులను రవాణా చేస్తున్న నాటు పడవ దారి తప్పింది. పూరీ జిల్లా బ్రహ్మగిరి కృష్ణప్రసాద్ మండలం పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 7:30 గంటలకు జొహ్నికుదా వైపు వెళ్తుండగా పడవ సరస్సు మధ్యలో చిక్కుకుంది. పొగమంచు దట్టంగా కమ్మడంతో ఈ ముప్పు తలెత్తినట్లు సమాచారం. ఇందులో 40మంది ప్రయాణికులు, 15 బైక్‌లు, ఆటోను తరలిస్తుండగా అకస్మాతుగా స్తంభించి పోయింది. సరస్సు నడిబొడ్డున దాదాపు 50 నిమిషాల పాటు చిక్కుకుపోయింది.

'పాట.. మాటే పేరు తెచ్చాయి'


ఆదిత్యుని జ్ఞాపికను సింగర్ మనోకు అందజేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అరసవల్లి: భగవంతుని ఆశీస్సులతోనే దశాబ్దాలుగా సినీ గీతాలను ఆలపించే అవకాశం తనకు దక్కిందని, అలాగే పాటలతో పాటు డబ్బింగ్ మాటలే ఇంతటి ప్రఖ్యాతిని తెచ్చిపెట్టాయని ప్రముఖ సినీ గాయకుడు మనో అన్నారు.

ఆయన ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జనుల సృష్టికి, జీవన గమనానికి ఆదిత్యుడే కర్మసాక్షి అని, నిజంగా పెద్ద పండుగ నాడు ఆదిత్యుడిని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇప్పటివరకు పలు భాషల్లో సుమారు 25 వేల పాటలను పాడినట్లుగా వివరించారు.

అంతకుముందు ఆయనకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావులు ఘనంగా ఆహ్వానించి అంతరాలయ దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వారికి కనుమ నాడు భోగి


కొసమాలలో కనుమ నాడు భోగి చేసుకున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలోని దేవాంగుల వీధిలో కనుమరోజునే భోగి చేస్తారు. అది అనాదిగా వస్తున్న ఆచారమని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా సోమవారం నాడు భోగి నిర్వహించారు. భోగి నాడు చేనేత వస్త్రాల తయారీలో స్థానికులు బిజీగా ఉంటారని, అందుకే కనుమ నాడు భోగి చేసుకోవడాన్ని పూర్వీకులు అలవాటు చేశారని స్థానికులు తెలిపారు.

అలరించిన జానపద కళలు

మెళియాపుట్టి: సంక్రాంతి నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు గ్రామీణ కళలు, జానపద నృత్యాలు చేస్తూ అలరించారు.

దీనబంధుపురం గ్రామానికి చెందిన గిరిజన కళాకారులు హరిపురం దండాశి, లోకొండ కృష్ణారావు, జన్ని సోమేష్‌లు మాట్లాడుతూ మన కళలు, సంస్కృతి సంప్రదాయాల గురించి భావి తరాలకు తెలియజేయాల్సి ఉందన్నారు.


మెళియాపుట్టిలో 'మేమే గుర్రాన్ని' ప్రదర్శిస్తున్న గిరిజనులు

రేపు 'రథసప్తమి' ఉత్సవ సమన్వయ కమిటీ సమావేశం


వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

అరసవల్లి: ఈ నెల 28వ తేదీ రథసప్తమి ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆలయ అనివెట్టి మండపంలో జరుగుతుందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న ఈ సమావేశంలో అరసవల్లిలో సప్తమి ఏర్పాట్లు, సూచనలపై తొలి దశగా సమీక్షించనున్నారని వివరించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఫైర్, వైద్యారోగ్య శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. భక్తులకు గతంలో కంటే మెరుగైన సౌకర్యాలతో సజావుగా దర్శనాలకు ఏర్పాట్లు ప్రస్తుతానికి జరుగుతున్నాయని ఈఓ వివరించారు.

ఘనంగా సైనిక దినోత్సవం

కవిటి: మండలంలోని దూగానపుట్టుగ, కొత్తపుట్టుగ గ్రామాల్లో ఆదివారం ఇండియన్ ఆర్మీడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దూగానపుట్టుగలో సైనికుడి విగ్రహానికి యువకులు ఘనంగా నివాళులు అర్పించారు. కొత్తపుట్టుగలో గత 17 ఏళ్లపాటు భారతసైన్యంలో సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి లక్ష్మీనారాయణను మాతృభూమి రుణం తీర్చుకుందాం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వేడుకల్లో భాగంగా భాగంగా లక్ష్మీనారాయణకు ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ నర్తు రామారావు, నర్తు చామంతిల సమక్షంలో దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికల్ని అందించారు. కార్యక్రమంలో నర్తు సోమేశ్వరరావు, నర్తు అశోక్, సప్ప శ్రీనువాసరావు, దేవరాజ్, వాసుదేవ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపుట్టుగలో విశ్రాంత సైనికుడిని సత్కరిస్తున్న దృశ్యం

ఊరికి ఉత్సాహం

సంక్రాంతి సంబరాలను ఊళ్లు ఉత్సాహంగా జరుపుకున్నాయి. పెద్ద పండగ సందర్భంగా జిల్లాలోని పలు పల్లెల్లో జాతరలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఉత్సవానికి జనం పోటెత్తారు. భోగి నాడు మొదలైన వేడుకలు కనుమ వరకు కన్నుల పండువగా సాగాయి. బంధువులు, చుట్టాల రాకతో గ్రామాలు కళకళలాడాయి.


మల్లన్న కొండపై భక్తులు

● ఉప్పొంగిన మెట్టవలస

మెట్టవలస గ్రామంలోని మల్లికార్జున స్వామి యాత్ర మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఏకశిలా పర్వతం భక్తజనంతో ఉప్పొంగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ సామంతుల రామారావు ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించారు. – జి.సిగడాం

● ఘనంగా అప్పన్నమ్మ తల్లి కనుమ సంబరాలు

పెదపాడు గ్రామంలో వెలసిన అప్పన్నమ్మ తల్లి ఆలయ కనుమ పండుగ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రధాన పురోహితులు చోడిమోడి అప్పలరామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా అప్పన్నమ్మతల్లి పుట్టిన సదరు నుంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో, సాము గరిడీతో ఊరేగింపుగా నీలమ్మ గుడి వరకూ కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఏటా కనుమ రోజున ఈ పండుగ ఉత్సవాను గ్రామపెద్దలంతా కలిపి పెద్ద ఎత్తున నిర్వహించడం ఇక్కడ పరిపాటి. ముగ్రాటలు, ఘటాలు, డప్పులు, మేళాలు, తప్పెడు గుళ్ల వాయిద్యాలు అలరించాయి. –శ్రీకాకుళం రూరల్


అప్పన్నమ్మతల్లి


తప్పెడుగుళ్లతో ముగ్రాటలు తీసుకెళ్తున్న దృశ్యం


సంగమయ్య కొండ వద్ద భక్తులు

● పోటెత్తిన భక్తజనం

సంక్రాంతి సందర్భంగా సంగమయ్య కొండ భక్తులతో పోటెత్తింది. ఆది, సోమవారాల్లో కొండ వద్ద జాతర నిర్వహించారు. ప్రాచీనకాలం నాటిదిగా గుర్తింపు పొందిన సంగమయ్య కొండను గోప కొండగా పిలుస్తారు. ఏటా ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందినవారు, ఇతర జిల్లాల నుంచి, పక్కన ఉన్న ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భారీగా జనం వచ్చి సంగమయ్య కొండను, గుహలో ఉన్న సంగమయ్యను దర్శించుకున్నారు. సంగమయ్య దర్శనం అనంతరం కొండ దిగువ ప్రాంతంలో నిర్వహించే జాతరలో వేలాది సంఖ్యలో జనం పాల్గొన్నారు. జాతర వద్ద నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో చిన్నారులు సందడిగా గడిపారు. –ఆమదాలవలస రూరల్

● 12 గ్రామాల మీదుగా ఊరేగింపు

రాజుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న రట్టి వల్లభనారాయణుని మందస పయనం సోమవారం వైభవంగా జరిగింది. భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలోని వల్లభనారాయణస్వామి ఏటా ధనుర్మాసంలోని కనుమ రోజున మందసలోని రాజావారి కోటకు వెళ్తారు. ప్రత్యేక పూజల అనంతరం తిరిగి రట్టి గ్రామానికి తీసుకువస్తారు. సంప్రదాయం ప్రకారం వల్లభ నారాయణ స్వామిని సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస పట్టణానికి అంబుగాం–బొడ్లూరు, హరిపురం, బాలిగాం, డబారు, ఉమాగిరి మీదుగా కాలినడకన తీసుకువచ్చారు. మందస రాజులకు సంతానం లేకపోవడంతో వల్లభనారాయణుని సముద్ర తీరం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో వారికి సంతాన కలిగిందట. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి రోజున స్వామిని మేళ, తాళాలతో ఊరేగింపుగా మందస రాజావారి కోటకు తీసుకువచ్చి పూజలు చేయడం ఆనవాయితీ. మందస వచ్చిన స్వామికి దారి పొడవునా భక్తులు అమృత భాండాలు, పూర్ణకుంభాలతో, పువ్వులు, కుంకుమలతో ఆహ్వానించి, ప్రత్యేక పూజలు జరిపారు. హరిపురంలో స్వామికి మహిళలు నీరాజనం పట్టారు. ఈ సందర్భంగా మహిళలు స్వామివారి ముందు కోలాటం ప్రదర్శించారు. – మందస


హరిపురంలో స్వామిని ఆహ్వానిస్తున్న భక్తులు

● లోలుగులో కోడెబళ్ల సంబరాలు

మండలంలోని లోలుగు గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం కోడే బళ్ల సంబరాలు, ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఏటా సంక్రాంతికి ఇక్కడ కోడె బళ్ల సంబరాలు జరుగుతాయి. పోటీల్లో గెలుపొందిన వారికి జెడ్పీటీసీ లోలుగు కాంతరావు బహుమతులను అందజేశారు. –పొందూరు


కోడెబళ్లను తోలుతున్న జెడ్పీటీసీ లోలుగు కాంతారావు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోమాత పూజలు



కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొండ: స్థానిక కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో గోమాత పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనుమ పండగ రోజు గోమాతను పూజిస్తే సకల దేవతల దర్శనం చేసుకున్నట్లు అని, అలాగే సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఆవులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటల సాగుపై ఆసక్తి



పణుకుపేటలో పామాయిల్ మొక్కలు నాటుతున్న రైతులు

సీతానగరం: మండలంలోని ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడడంతో చెరకు సాగు చేసే పొలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అధికమంది పామాయిల్ తోటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. బగ్గందొరవలసలోని పామాయిల్ మిల్లు యాజమాన్యం ఏర్పాటుచేసిన నర్సరీ నుంచి మొక్కలు తెచ్చి నాటుతున్నారు. అంతర పంటలుగా అరటి, మొక్కజొన్న, అపరాలు, కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. 2021-22, 2022-23 సీజన్లలో 2,800 ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ మొక్కలను రైతుల నాటినట్లు నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

మళ్లీ వచ్చిన ఏనుగులు



చింతలబెలగాం అరటి తోటలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: ఏనుగుల గుంపు వెంకటరాజపురం, బాసంగి, బాసంగి గదబవలస, చింతలబెలగాం, సింగనాపురం, కుదమ తదితర గ్రామాల పంట పొలాల్లోకి ఆదివారం రాత్రి మళ్లీ ఏనుగులువచ్చాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది కోరారు. నాగావళి నది, గుమ్మడిగెడ్డవాగులో తాగునీరు పుష్కలంగా ఉండడం, అరటి, చెరకు, కూరగాయల పంటలు ఆహారంగా లభిస్తుండడంతో ఎటువెళ్లినా ఇక్కడకే వస్తున్నాయన్నారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని, ఏనుగుల జాడ చూసుకుని పొలంపనులకు వెళ్లాలని కోరారు.

ఆసరా కల్పిస్తున్న హాస్టల్స్

- జిల్లాలో 5 సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు
- ఒక్కోదానిలో 50 మంది చొప్పున 250 మందికి వసతి
- సౌకర్యాల కల్పనలో సమగ్రశిక్ష, విద్యాశాఖ

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న సీజనల్ హాస్టల్స్ విద్యార్థులకు ఆసరా కల్పిస్తున్నాయి. చక్కగా చదువుకునేందుకు అవసరమైన వసతిని ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వలసవెళ్లినప్పుడు వారి పిల్లల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీజనల్ హాస్టల్స్‌ను గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభించింది. హాస్టల్స్‌లో విద్యార్థులకు మూడు పూటలా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తోంది. విద్యార్థులకు అనుభవజ్ఞులైన శిక్షకులచే స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. మెంటాడ మండలంలో పెదమేడపల్లి, జక్కువ, జామి మండలంలోని విజినిగిరి, దత్తిరాజేరు మండలంలోని టి.బూర్జువలస, పూసపాటిరేగ మండలంలో బర్రిపేట గ్రామాల్లో నడుస్తున్న సీజనల్ హాస్టల్స్‌లో ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్స్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ.. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నామని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ స్వామినాయుడు తెలిపారు.

చిల్డ్రన్స్ బోటు విహార్ ప్రారంభం

సీతంపేట: సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక అడ్వంచర్ పార్కులో కొత్తగా చిల్డ్రన్స్ బోటు విహార్‌ను ఆదివారం ప్రారంభించారు. పార్కుకు వచ్చే చిన్నారులను సైతం అలరించేందుకే ఈ బోటు విహార్‌ను ప్రారంభించినట్లు ఐటీడీఏ ఏపీఓ వై.రోసిరెడ్డి తెలిపారు.

సంబరంగా సంక్రాంతి



- పండగకు రూ.కోట్లు ఖర్చు చేసిన ఉమ్మడి జిల్లా ప్రజలు
- కొత్త వస్త్రాలకు రూ.250 కోట్లకు పైగా ఖర్చు
- మాంసం, పిండి వంటలు, వినోద ఖర్చులకు రూ.50కోట్లు
- సంప్రదాయ ఆటలు, పందాల నిర్వహణకు రూ.25 కోట్లు
- ప్రయాణ ఖర్చులు రూ.4 కోట్లకు పైమాటే

విజయనగరం:

సంక్రాంతి వచ్చింది.. ఇంటింటా సరదాలు తెచ్చింది... కరోనా ప్రభావంతో గత రెండేళ్లు ఆంక్షలు నడుమ చేసుకున్న తెలుగింట పండగను ఈ ఏడాది మూడురోజులపాటు వైభవంగా జరుపుకున్నారు. ఇళ్ల అలంకరణ, నూతన వస్త్రాలు, ప్రత్యేక వంటకాలతో పల్లెల్లో కొత్త సందడి కనిపించింది. సామాన్యుడు, సంపన్నుడనే తారతమ్యం లేకుండా ఎవరి స్థాయిలో వారు పండగను ఆస్వాదించారు. ఏడాదిలో మొదటిగా జరుపుకునే పండగకు ప్రత్యేక స్థానం కల్పిస్తూనే ఖర్చులోనూ అదే ప్రాధాన్యమిచ్చారు. ఈ మూడు రోజుల కోసం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు కోట్లలో ఖర్చు చేశారంటే పండగ సందడి అర్థం చేసుకోవచ్చు.



నూతన వస్త్రాల కోసం రూ.250 కోట్లు పైమాటే...



సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు వస్త్ర దుకాణాలకు పెద్ద పండగ వచ్చినట్టే. ఏడాదిలో చేసే వ్యాపారం ఈ ఒక్క నెలలోనే సాగుతుంది. కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నూతన వస్త్రాలు కొనుగోలు చేయడం ఆనవాయితీ. దీంతో వీటి వ్యాపారానికి గిరాకీ పెరుగుతుంది. విజయనగరం పట్టణంలో 'బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్'లో జోరుగానే విక్రయాలు సాగాయి. సుమారు 250 వరకు బ్రాండెడ్, సాధారణ దుకాణాలుండగా.. ప్రధానంగా పిల్లల రెడీమేడ్ దుస్తులు, మహిళల చీరలు అమ్మకాలు అధికంగా సాగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి, సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మధ్యప్రదేశ్ ప్రాంతాలను నుంచి రిటైల్ వ్యాపారులు ఈ మార్కెట్‌కి వచ్చి నిత్యం విక్రయాలు చేస్తుంటారు. రిటైల్ వ్యాపారంతో బిజీగా ఉన్న దుకాణ యాజమాన్యులు సాధారణ వినియోగదారుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఒక అడుగు ముందుకువేసి షాపు ముందే ఆరుబయట తాత్కాలిక అమ్మకాలు చేశారు. పట్టణంలోని కన్యకాపమేశ్వరి ఆలయం కూడలిలోని ఉల్లి వీధి, గంటస్తంభం జంక్షన్, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లోని ప్రధాన షాపుల్లో కూడా వస్త్రవిక్రయాలు జోరుగా సాగాయి. మొత్తంగా జిల్లాలో ఈ ఏడాది రూ.250 కోట్ల వరకు వస్త్ర వ్యాపారం సాగినట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

జాతర సందడి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు సంక్రాంతి, కనుమ పండలను ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరుపుకున్నారు. మహిళలు రంగవల్లుల పోటీలతో అలరించగా, యువత క్రీడలతో సందడి చేశారు. ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో విందు ఆరగించి ఆనందంగా గడిపారు. జాతరలకు పోటెత్తారు.

విందు.. వినోదాల కోసం..

కొత్త అల్లుళ్లకు మర్యాదలు, ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు సందడిగా మారాయి. పండగ మూడు రోజుల పాటు మాంసాహారానికి, పిండివంటకాలు, వినోద ఖర్చుల కోసం రూ.50 కోట్లు ఖర్చు చేయగా అందులో కేవలం మాంసాహారానికి రూ.20 కోట్ల వరకు ఖర్చు చేశారు. కిలో మటన్ ధర రూ.800 పలికింది. గతేడాది రూ.700 ఉన్న ధర ఈ ఏడాది రూ.100 పెరిగింది. అలాగే, చికెన్ పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది స్కిన్‌తో కలిపి రూ.180, గ్రామీణ ప్రాంతాల్లో రూ.190 నుంచి రూ.200 వరకు పలికింది. ఇతర సరదాల కోసం రూ.5 కోట్ల వరకు ఖర్చు చేశారని అంచనా.

పెరుగుతున్న ఖర్చు...

తెలుగువారింట ఎంతో ఆడంబరంగా జరుపుకొనే సంక్రాంతి పండగ ఖర్చు ఏటేటా పెరుగుతోంది. శుభకృతనామ సంవత్సరంలో జనవరి 14, 15, 16 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా జరుపుకున్న పండగ కోసం రూ.కోట్లలో ఖర్చయినట్లు వ్యాపార వర్గాలు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలో 166 మద్యం దుకాణాలు ఉండగా... బార్‌లు 31 వరకు ఉన్నాయి. వీటి ద్వారా గడిచిన పక్షం రోజుల్లో సుమారు రూ.25 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగాయి. విలాసాలు, ఆడంబరాలకు జనం వెనుకాడకుండా మరో రూ.20కోట్లు వరకు ఖర్చుచేసినట్టు అంచనా.



తాళ్లబురిడిలో వింజమ్మ జాతరలో పాల్గొన్న గ్రామస్తులు

ప్రయాణ ఖర్చు రూ.4 కోట్ల పైమాటే..

వివిధ ప్రాంతాల నుంచి పండగకు పల్లెలకు చేరుకున్న వారు గతవారం రోజుల్లో సుమారు రూ.4 కోట్లు వరకు ఖర్చు చేశారు. విజయనగరం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, ఎస్.కోట డిపోల్లో సుమారు 560 ఆర్టీసీ సర్వీసులు నడుస్తుండగా... సాధారణ రోజుల్లో రూ.40 లక్షలు వరకు ఆదాయం వస్తుంది. కేవలం విజయనగరం జిల్లా కేంద్రం నుంచి విజయవాడ, హైదరాబాద్‌కు 14 సర్వీసులు నిర్వహించగా... సాధారణంగా నడిపే 111 సర్వీసుల నుంచి పండగ నేపథ్యంలో రూ.2 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని అంచనా. వ్యక్తిగత వాహనాలపై రాకపోకలకు మరో రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారని అంచనా.





వేపాడ: కొండపైకి వెళ్తున్న తోమడ పెద్దు

భక్తజన జాతర..

వేపాడ: విజయనగరం జిల్లాలో సంక్రాంతి, కనుమ పండగలు వైభవంగా జరిగాయి. కనుమ పండగను పురస్కరించుకుని సోమవారం పలు గ్రామాల్లో నిర్వహించే తీర్థాలకు జనం పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేపాడ మండలం కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జాతర జనసంద్రాన్ని తలపించింది. జాతరలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి.

రైతన్నకు సహకారం



వీరఘట్టం పీఏసీఎస్ కార్యాలయం

- పాడి పశువుల కొనుగోలుకు రుణాలు
- ధాన్యం కొనుగోళ్లలో చొరవ

వీరఘట్టం సహకార సంఘం లావాదేవీల వివరాలు

రుణ వివరాలు	రైతుల సంఖ్య	రుణాలు
మూల షేర్	4,637	రూ.18.64 కోట్లు
స్వల్పకాలిక రుణాలు	2,785	రూ.18.01 కోట్లు
దీర్ఘకాలిక రుణాలు	85	రూ.99.82 లక్షలు
పాడి రుణాలు	105	రూ.49.42 లక్షలు
ఇతర రుణాలు	26	రూ.77.22 లక్షలు
ధాన్యం వ్యాపారం	495	రూ.7.63 కోట్లు

వీరఘట్టం: రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వీరఘట్టం సహకార సంఘం అడుగులేస్తోంది. ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తోంది. రైతులకు విరివిరిగా రుణాలు మంజూరుచేస్తోంది. ధాన్యం, పాడి పశువుల కొనుగోలుకు విస్తారంగా రుణాలు అందిస్తోంది. ఆడపడుచులకు అండగా నిలుస్తోంది. వ్యాపారాభివృద్ధికి సాయపడుతోంది. రెండు సీజన్లల్లో రూ.7.63 కోట్ల మేర ధాన్యం వ్యాపారం చేసింది. 495 మంది రైతుల నుంచి రూ.50 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించింది. రైతులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయడంతో చురుగ్గా వ్యవహరించింది. రైతులకు పట్టాదారు పుస్తకాలు కలిగిన వారికి ఎకరానికి దీర్ఘకాలిక రుణాలు కింద రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు మేర స్వల్ప వడ్డీలకు రుణాలు అందిస్తోంది. 216 మంది రైతులకు గతేడాది రూ.18 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు అందజేసింది.

పాడిరైతుకు అదనపు ఆదాయం....

పంటలు సాగు చేస్తూ పాడి పశువులున్న 105 మంది రైతులను గుర్తించి వారికి రూ.1లక్ష నుంచి రూ.3 లక్షల చొప్పున రూ.49.42 లక్షల రుణాలను ఎలాంటి ఆస్తిపత్రాలను తనఖా పెట్టకుండా మంజూరు చేసింది. రైతన్నలు పాడి పశువుల పెంపకంతో అదనపు ఆదాయం ఆర్జించేలా సహకరిస్తోంది.

రైతన్నకు గరిష్ట మద్దతు ధర

రైతులకు ఏటా ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌బీకేలను సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నాం.

– బూరాడ పైడిరాజు, సీఈఓ, పీఏసీఎస్, వీరఘట్టం

బోనాల పండగ



తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు సజీవంగా సాగుతున్నాయి. తెలంగాణాలో నిర్వహిస్తున్న బోనాల పండగ మాదిరిగా బలిజిపేట మండలం మిర్తివలస గ్రామంలో మూడుతరాల నుంచి నిర్వహిస్తున్నారు. ఏటా సంక్రాంతి పర్వదినాన గన్ను, గునపర్తి, మానం, శిగురుకోట, గంగు, గుండావు కుటుంబాలవారు బోనాల పండగ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఐదు కుండలకు పసుపుకుంకమ బొట్లుపెట్టి.. వాటిని పూలతో అలంకరించి.. అందులో కలగూర, పరమాన్నం, మైదాపిండి అట్లు, అరిసెలు, అరటి పండ్లను వేసి ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారున ఉన్న ఎంకమ్మపేరంటాలకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆ వంటకాలను కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు.

– బలిజిపేట


పండగవేళ.. పర్యాటక శోభ

సంక్రాంతి, కనుమ పండగ వేళ దూర ప్రాంతాల నుంచి పల్లెలకు చేరుకున్నవారంతా పర్యాటక ప్రాంతాల సందర్శనకు పరగుతీశారు. జలాశయాలు, జలపాతాలను సందర్శించారు. పార్కుల్లో సేదతీరారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. తోటపల్లి రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు.

-గరుగుబిల్లి



తోటపల్లి రిజర్వాయర్‌లో బోటుషికారు చేస్తున్న సందర్శకులు



గరుగుబిల్లి: శివ్వాం-నాగూరుకు సమీపంలోని నాగావళినది తీరంలో రేగాలకండివద్ద వెలసిన రేగాలమ్మ దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



తోటపల్లి ప్రాజెక్టువద్ద సందర్శకుల సందడి



కొమరాడ: జంఝావతి రబ్బర్ డ్యామ్ వద్ద జన సందడి



పైడితల్లికి అరిసెలు, పండ్లతో నైవేద్యం

పైడితల్లికి ప్రత్యేక పూజలు...

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారు సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని భక్తులకు పుష్పాలు, ద్రాక్ష పండ్ల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతికరమైన అరిసెలు, గారెలు, బూరెలను భక్తులు నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.

- గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గోపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శోభారాణి, సోమశేఖర్ శర్మ, అనంతలక్ష్మి, రుజుతారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. విజయనగరం టీటీడీ కల్యాణమండపం ఆవరణలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అర్చకుడు పీవీ నరసింహాచార్యులు, వేదపండితులు జి.గురునాథరావు శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

